నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
సోమవారం | సెప్టెంబర్ 30, 2024 | www.navatelangana.com

తడిసిన సోయా



- ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో కురిసిన వర్షానికి చేతికొచ్చిన సోయా పంట తడిసి ముద్దయింది. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వర్షానికి మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్లపై ఆరబెట్టిన సోయా పంట వరదకు కొట్టుకుపోయింది. ఏదైనా పంట చేతికి వస్తే ఆరబెట్టుకోవడానికి గిడ్డంగులు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వ్యవసాయ గిడ్డంగులు ఉంటే వాటిలో ఆరబెట్టుకోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన సోయపంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు ఎక్సైజ్ శాఖ మంత్రి పర్యటన

- మూడు చోట్ల ఎక్సైజ్ కార్యాలయాల ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ-నిజామాబాద్

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నేడు (సోమవారం) జిల్లాలో పర్యటించనున్నారు. తొలుత మోర్తాడ్‌లో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం భీంగల్, ఆర్మూర్‌లో సైతం నిర్మించిన కార్యాయాలను ప్రారంభించనున్నారు. తదనంతరం నిజామాబాద్ నగరంలో పలు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొనున్నారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీతో కలిసి కార్యాక్రమాల్లో పాల్గొననున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

అరకొర వేతనం.. ఆలస్యం

వేతనాలు అందక జీపీ కార్మికులకు మాడుతున్న కడుపు

- 4 నుంచి 6 నెలలుగా పెండింగ్
- దుర్భరంగా మారుతున్న జీవనం
- తూతూ మంత్రంగా నిధులు విడుదల
- స్పందించని ప్రభుత్వం

నవతెలంగాణ-కామారెడ్డి

అసలే అరకొర వేతనం. ఆ వేతనంతో కుటుంబాలు గడవడం కూడా గగనమే. ఎప్పటికైనా తమ సేవలను పాలకులు గుర్తించి పర్మినెంట్ చేయకపోరా అన్న ఆశతో పని చేస్తున్న జీపీ కార్మికులకు.. ఇచ్చే అరకొరవేతనం సైతం ఐదారు నెలలుగా పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో కార్మిక కుటుంబాలు దుర్భర జీవితం గడుపుతున్నారు. ఉద్యోగులకు ఇచ్చినట్లే ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు. అదే విధంగా మల్టీపర్పస్ విధానం తొలగించి కార్మికుల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా చేసి అంటు వ్యాధుల నుంచి ప్రజలను దూరంగా ఉంచడంలో జీపీ కార్మికులకు విశేష కృషి చేస్తుంటారు. అలాంటి కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో పెడుతుండటంతో వారి కుటుంబాలు దుర్భర జీవనం గడుపుతున్నాయి. కామారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికులకు రావలసిన వేతన బకాయిలు కొండంతా అయితే ఈ మధ్య విడుదల చేసింది మాత్రం గోరంత అని కార్మిక నాయకులు మండిపడుతున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 22 మండలాలు, 526 గ్రామపంచాయతీలలో 1965 మంది మల్టీవర్కర్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు 9500 చొప్పున వేతనం ప్రభుత్వం చెల్లిస్తుంది. గత కొన్ని నెలలుగా తమకు వేతనాలు రావడం లేదని తమకు పూట గడవడం కష్టంగా ఉందని గ్రామపంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో అధికారులకు విన్నవిస్తూ వస్తున్నారు. అందుకు ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలకు ఈనెలలో ఒక కోటి 99 లక్షల రూపాయలను జిల్లా ఖజానా కార్యాలయంలో జమ చేసింది. జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 1965 మందికి ఒక్క నెలకు గాను ఒక కోటి 86 లక్షల 75 వేల రూపాయల వేతనం ఇవ్వవలసి ఉంటుంది. ప్రభుత్వ మాత్రం ఒక కోటి 99 లక్షల రూపాయలను మాత్రమే జమచేయడం గమనార్హం.



మేజర్ గ్రామపంచాయతీలో ప్రతినెల కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నా, మధ్య, చిన్న స్థాయి గ్రామపంచాయతీలో మాత్రం సుమారు నాలుగు నెలల నుంచి ఆరు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మూడు నెలల వేతనాలు ఇవ్వాలన్నా సుమారు రూ.5.60 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం వేసింది ఒక నెల వేతనం మాత్రమే.

మల్టీపర్పస్‌తో పనిభారం

మల్టీ పర్పస్ విధానంతో కార్మికులకు అదనపు భారం పడుతుంది. తమను ఒకే పనికి కేటాయించాలని కోరుతున్నా ప్రభుత్వం మాత్రం కార్మికుల గురించి ఆలోచన చేయడం లేదు. ఒకరోజు వాటర్ ఇప్పడానికి పంపిస్తే మరొక రోజు విద్యుత్ పనికి పంపడం, మరొక రోజు శుభ్రం చేయడానికి పంపించడంతో కార్మికులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. అలాకాకుండా విద్యుత్ పనికి ఒక కార్మికున్ని పర్మినెంట్ గా ఉంచాలని, వాటర్ మెన్‌గా పని చేస్తున్న వారిని ప్రత్యేకించి గుర్తించాలని, పారిశుద్ధ కార్మికులను గుర్తించి వారి వారి పనులను బట్టి వారికి గుర్తింపునివ్వాలని కార్మికుల కోరుతున్నారు. పనికి తగ్గట్టు వేతనాలు అమలు చేయాలని కోరుతున్నారు.

చాలీచాలని వేతనాలు

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం నెలకు ఇస్తున్న 9,500 ఈ పరిస్థితులలో వారికి ఇవి ఏ మూలకు సరిపోవడం లేదు. ప్రస్తుతం మార్కెట్లో ప్రతి వస్తువు ధర సామాన్యునికి అందుబాటులో లేకుండా పోయింది. మున్సిపల్ కార్మికులు ఈ 9500 రూపాయలతో కుటుంబాన్ని పోషించుకోవడం, పిల్లలని చదివించడం, పండగలు వస్తే ఇల్లు గడవడం కష్టంగా మారుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

భద్రత లేక ఇబ్బందులు

కరోనా వచ్చినా.. డెంగ్యూ ఇతరాత్ర రోగాలు వ్యాప్తి చెందుతున్నా పరిశుభ్రతా చర్యల్లో భాగంగా ముందు నిలిచేది కార్మికులే. ఎంతటి కష్టం వచ్చినా వీరు ముందు నిలుస్తుంటారు. అలాంటి కార్మికులకు ఉద్యోగ భద్రత లేదు. ఇన్సూరెన్స్ సైతం లేకపోవడంతో అభద్రతాభావం వారిలో నెలకొంది. వారికి ప్రభుత్వం ఇన్సూరెన్స్ కల్పిస్తే అనుకోని ప్రమాదాలు జరిగిన సమయంలో బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చే అవకాశం ఉంది.

నిధులు కేటాయించాం

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు



గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల కోసం ఒక కోటి 99 లక్షల రూపాయలను జిల్లా ఖజానా కార్యాలయంలో జమ చేశాము. మిగతా పెండింగ్ వేతనాలు సైతం త్వరలో మంజూరు అవుతాయి. ప్రతి గ్రామపంచాయతీ కార్మికులకు ఆయా మండలాల్లోని ఆరోగ్య కేంద్రాలలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాము. మా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఉన్నతాధికారులకు నివేదించాం.

సన్మానించడం కాదు.. ఆకలి తీర్చండి


వెంకట్‌గౌడ్. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు (సీఐటీయూఐ)



గ్రామ పంచాయతీ వర్కర్స్ చాలీచాలని వేతనాలతో గల్లి గల్లి, వాడ వాడ శుభ్రత, పరిశుభ్రత చేస్తూ ప్రజల ఆరోగ్యాలను రక్షిస్తున్నారని వారిని సర్పంచి నుండి మొదలుపెడితే ప్రధానమంత్రి వరకు శాల్వాలు కప్పి సన్మానిస్తున్నారు తప్ప వారి ఆకలి తీర్చడం లేదు. కార్మికులకు పని భద్రత లేదు, వేతనాలు పెంచడం లేదు. ఉన్న వేతనాలు సైతం పెండింగ్ పెడుతున్నారు. ఇప్పటివరకు ప్రతి గ్రామంలో 5 నుంచి 8 నెలల వరకు జీతాలు ఇవ్వడం లేదు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలను మంజూరు చేయాలి. పంచాయతీ సిబ్బందికి రెండవ పీఆర్సీ వర్తింపజేయాలి. కార్మికులందరికీ 10 లక్షల ఇన్సూరెన్స్ బీమా పథకాన్ని తక్షణమే నమోదు చేయించాలి. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతాం.

విద్యుత్ శాఖలో ప్రక్షాళన

- బదిలీలకు రంగం సిద్ధం
- జిల్లాలో దశాబ్దాలుగా పలువురి అధికారుల తిష్ట



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్‌శాఖ ప్రక్షాళనలో భాగంగా అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) ఉద్యోగుల బదిలీలకు ఉత్తర్వులు జారీ చేసింది. రెండేండ్లు, అంతకు మించి ఒకే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. దీంతో భాగంగా డీఈ నుంచి మొదలు జేఎల్ఎం వరకు బదిలీలు చేపట్టనున్నారు.

కాగా జిల్లాలో పలువురు అధికారులు పదేండ్లకు పైగా తిష్టవేసుకొని కూర్చుండటం గమనార్హం. ఆదాయ వనరులు పుష్కలంగా ఉండటంతో జిల్లాను వదిలేందుకు ఇష్టపడట్లేదని భోగట్ట. పలువురు ఏడీఈలకు.. డీఈలుగా ప్రమోషన్ వచ్చినా జిల్లాను వదలలే. రాజకీయ పలుకు బడితో ఆర్మూర్, బోధన్ అంటూ జిల్లానే అంటిపెట్టు కుంటూ ఉండటం గమనార్హం. డీఈగా ప్రమోషన్ వస్తే ఖచ్చితంగా ఇతర జిల్లాకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోనే కొనసాగడం గమనార్హం. అదే విధంగా పలువురు అధికారులపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లు వెత్తాయి. డీఈగా ప్రమోషన్ పొందిన ఓ ఏడీఈపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఉన్నతాధికారులు వచ్చి విచారణ చేపట్టినా.. ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కులసంఘాలు, యూనియన్ ప్రొటెక్షన్ పేరుతో ఎక్కడికీ వెళ్లకుండా పలువురు అధికారులు జిల్లాను దాటలేరు. ఈ నేపథ్యలో ఈసారి బదిలీల్లో స్థాన చలనం జరిగేనా అన్న చర్చ విద్యుత్‌శాఖలో కొనసాగుతోంది.

బదిలీలు పొందే ఉద్యోగులు అక్టోబర్ 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. బదిలీల ఉత్తర్వులు అక్టోబర్ 7వ తేదీనా జారీ అయ్యే అవకాశం ఉంది. బదిలీ ఉత్తర్వులు వెలువండ వెంటనే 9 రిలీవ్ కావాల్సి ఉంటుందని ఇది వరకే ఆదేశాలు జారీ అయ్యాయి. అధికారులలో మొన్నటి వరకు ప్రమోషన్లు ముగిసిన తర్వాత బదిలీలు నిర్వహిస్తున్నారని పలువురు యూనియన్ నాయకులు అంటున్నారు.

గతంలో ప్రతి మూడేండ్లకు ఓసారి బదిలీలు చేపట్టేవారు. ప్రస్తుతం 2 సంవత్సరాలకే విద్యుత్ శాఖలో బదిలీలు చేపడుతున్నారని ఉద్యోగులు అంటున్నారు. జిల్లాలో విద్యుత్‌శాఖ అధికారులు ఒకే హోదాలో 2 సంవత్సరాల వరకు ఒకే ప్రాంతంలో విధులు నిర్వర్తించిన ఉద్యోగులు బదిలీపై వెళ్లనున్నారు. జిల్లాలోని విద్యుత్‌శాఖలో జూనియర్ లైన్‌మెన్ నుంచి డీఈ వరకు వివిధ హోదాలలో సుమారు 300 మంది వరకు బదిలీలు అయ్యే అవకాశాలు ఉన్నట్టు సమాచారం.

ప్రజల కోసం పోరాటం చేస్తే నేరమా?

- అర్ధరాత్రి అరెస్టు పట్ల మండిపడ్డ సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్



నన్నేసాబ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-వర్ని(చందూర్)

నిజామాబాదు జిల్లా చందూర్ మండల కేంద్రంలో నిరుపేద ప్రజల హక్కుల కోసం పోరాడితే నేరం చేసినట్లు పోలీస్ లు తనను ఆదివారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారని సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ మండిపడ్డారు. ప్రజల కోసం పోరాటం చేస్తే నేరమా అని ప్రశ్నించారు. చందూర్‌లో ఇండ్ల స్థలాలు, పోడు భూముల సమస్యలపై పేద ప్రజల పక్షాన పార్టీ ఆధ్వర్యంలో తాను పోరాటం చేయటం అధికార, పతిపక్ష పార్టీలకు మింగుడు పడటం లేదని మండిపడ్డారు. చేతనైతే తాను చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని లేకుంటే అడ్డుపడటం మానుకోవాలని హెచ్చరించారు.

గురుకులంలో ఒక రోజు

- రాత్రి బస చేసి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్
- తెల్లవారుజామున పాలు, కూరగాయలు పరిశీలన



గురుకులంలో పిల్లలతో కలిసి నిద్రిస్తున్న కలెక్టర్



తెల్లవారుజామున వచ్చిన కూరగాయలు పరిశీలన

నవతెలంగాణ-మెండోరా

గురుకులాల్లో, కేజీబీవీల్లో, వసతిగృహాల్లో అధికారులు నెలలో ఒక రోజు బస చేయడంలో భాగంగా నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం రాత్రి మెండోరా మండలం పోచంపాడ్‌లోని బాలుర గురుకుల పాఠశాలలో బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించారు. స్టడీ అవర్‌లో పాఠ్యపుస్తకాలు చేతపట్టుకొని విద్యార్థులకు ప్రశ్నలు అడుగుతూ విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌తో పాటు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి రాత్రి అక్కడే పడుకున్నారు. అనంతరం ఆదివారం తెల్లవారుజామున గురుకులానికి వస్తున్న పాలు, కూరగాయలను పరిశీలించారు. వేకువజామున విద్యార్థుల రోల్-కాల్ ను పరిశీలించారు. శారీరక దృఢత్వం, ఆరోగ్య పరిరక్షణ కోసం జాగింగ్, వామప్ చేపించిన తీరును పరిశీలించారు. ఖోఖో ఆడేందుకు సిద్ధమైన విద్యార్థులను కలెక్టర్ పరిచయం చేసుకుని, వారి ఆటను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు పలు సదుపాయాలు లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, సంబంధిత రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడి వాటిని సమకూర్చేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పేద విద్యార్థుల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నందున విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయిని అధిరోహించేలా హాస్టళ్లు, గురుకులాల్లో అన్ని వసతులతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో జిల్లా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర ప్రతినిధి బృందం ఇప్పటికే రెండుసార్లు కలిసి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. వృత్తిలో ప్రమాదం వలన వందలాది మంది గీత కార్మికులు చెట్టుపై నుంచి పడి చనిపోవడం, వికలాంగులుగా మారుతున్నారని తెలిపారు. ఇప్పటికే 520 మంది ప్రమాదానికి గురయ్యారనీ, గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రస్తుత ప్రభుత్వం జాప్యం చేస్తుందనీ, ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మీ అమలు చేస్తూ గీత కార్మికులకు ప్రాణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదన్నారు. బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన 22.20 కోట్ల రూపాయలతో నిర్మించిన నీరా కేఫ్‌ని ఎలాంటి సంబంధం లేని టూరిజం డిపార్ట్మెంట్ నుంచి తొలగించి టాడి కార్పొరేషన్‌కి అప్పగించాలన్నారు.

ప్రతి జిల్లాలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేసి యువతి, యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి జీవో నెంబర్ 560 ప్రకారం 5 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఆగస్టు 18లోపు నిర్మించాలి. జనగామ జిల్లాకు పాపన్న 'పేరు' పెట్టాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి రూ.4,000 పెన్షన్ ఇవ్వాలి. కుల గణన తక్షణం చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలనీ, కల్తీ కల్లు పేరిట ఎక్సైజ్ దాడులు ఆపాలని, ప్రతి గ్రామానికి చెట్లు పెంచుకోవడానికి 5 ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శేఖర్‌గౌడ్, నర్సుగౌడ్, రామాగౌడ్, లింగం గౌడ్, బాలా గౌడ్ పాల్గొన్నారు.

సమాజ మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులే

- కాలానికి అనుగుణంగా విద్యలో మార్పు రావాలి
- గురుపూజోత్సవంలో ఎమ్మెల్యేలు డాక్టర్ భూపతిరెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త



ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సమాజ మార్గ నిర్దేశకులు అధ్యాపకులే అని, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో వస్తున్న మార్పులకు అందిపుచ్చుకొని బోధించే విధంగా చూడాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో అధ్యాపకులకు హెల్త్ కార్డులు, ఇతర సమస్యలను దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా తమ వంతు కృషి చేస్తామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ అన్నారు. ఆదివారం డిచ్‌పల్లి మండలం లోని బర్దిపూర్ శివారులోని బృందావనం గార్డెన్‌లో తెలంగాణ రికగ్నైజడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులకి ఉత్తమ ఉపాధ్యా య అవార్డుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు హాజరై మాట్లాడారు.

భూపతి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దనే విద్యాశాఖ ఉందని, విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో మార్పులు తీసుకుని రానున్నట్టు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకుని వచ్చారని అర్బన్ ఎమ్మెల్యే సూర్య నారాయణతో కలిసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించే విధంగా తమ వంతు కృషి చేస్తామన్నారు.

అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఏది సాధించాలన్న విద్యా అవసర మని, ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే గురువులదే ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ఎన్నికల అప్పుడే పార్టీలని ఎన్నికలు ముగిసిన తర్వాత కలిసికట్టుగా ఉంటూ జిల్లా అభివృద్ధికి పాటు పడతామని, ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ లో ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ప్రస్తా వించి పరిష్కరించే విధంగా చూస్తామ న్నారు.

డీఈవో ఎన్వి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి విద్యా బోధన చేయించడానికి కృషి చేయాలని సూచించారు. గౌరవ అతిథిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ గురువులు తమ శిష్యులను ఎలా తీర్చిదిద్దుతున్నారో ఒక సారి గుర్తు చేసుకోక తప్పదని, వారి బోధనలే నేడు ఈ స్థానానికి తీసుకొని వచ్చారన్నారు. కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్, ట్రస్మా జిల్లా అధ్యక్షులు రాస నిత్యానందం తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, చీఫ్ అడ్వైజర్ శేఖర్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ యాదగిరి, స్పోక్ పర్సన్ జయసింహ గౌడ్, రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు కాంతి గంగారెడ్డి, ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి గోజూరి అరుణ్, జిల్లా కోశాధికారి ఉప్పల మధు, ప్రోగ్రాం కన్వీనర్ నరసింహారావు, డిచ్ పల్లి ఉమ్మడి మండల అధ్యక్ష కార్యదర్శులు టి విక్రమ్, తేలు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ప్రయివేటు స్కూళ్ల ఉపాధ్యాయులు

బాల్యాన్ని కాటేస్తున్న బుక్కెడు బువ్వ

నవతెలంగాణ-రామారెడ్డి



బుక్కెడు బువ్వ బాల్యాన్ని కాటేస్తోంది. 77 ఏళ్లు పూర్తి చేసుకున్న స్వతంత్ర భారతదేశంలో బాల్యం బుక్కెడు బువ్వ కోసం ప్రయత్నిస్తుంది. అభివృద్ధిలో దూసుకు పోతుందని చెప్తున్నా, క్షేత్రస్థాయిలో పేదరిక రూపు మాపటంలో ప్రభుత్వాలు ఏ మేరకు అభివృద్ధి చేశాయో ఈ చిత్రాన్ని చూసి ఆత్మ పరిశీలన చేసుకోవాలి. రాజన్న సిరిసిల్ల జిల్లా, కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామం నుండి గంగిరెద్దులను పట్టుకొని కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలో వివిధ గ్రామాలను తిరుగుతూ, పొట్ట తిప్పల కోసం గంగిరెద్దును పట్టుకొని బుక్కెడు బువ్వ పెట్టాలని ఇంటింటికి తిరుగుతూ భిక్షాటన చేయడం మన దేశ, రాష్ట్ర అభివృద్ధికి నిదర్శనం.

ఉమ్మడి జిల్లా సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్



తలపడుతున్న క్రీడాకారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్రం హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు అక్టోబర్ 1వ తేదీన టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాయ్స్ స్కూల్ ఆర్మూర్ నందు నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సీనియర్ మేన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్‌ను నిర్వహించినట్టు నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ ఆదివారం తెలియజేశారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు తమ ఆధార్ కార్డ్‌తో అక్టోబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాయ్స్, స్కూల్ ఆర్మూర్ నందు నిజామాబాద్ జిల్లా హ్యాండ్బల్ కోశాధికారి గట్టడి రాజేష్ కు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్ కు రిపోర్ట్ చేయవలసిందిగా కోరారు.

కొనసాగుతున్న నీటి విడుదల

నవతెలంగాణ-మెండోరా

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గోదావరి నది లోకి 10 గేట్ల ద్వార నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుండి 44 వేల 268 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టు లోకి వచ్చి చేరుతుండటంతో దిగువ గోదావరి లోకి 29 వేల 678 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వరద కాలువ ద్వార 5000 క్యూసెక్కులు , కాకతీయ కాలువ ద్వార 6,800 , ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 , లక్ష్మి కాలువ ద్వారా 150 , సరస్వతి కాలువ ద్వార 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు మిషన్ భగీరథ ద్వార 231 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు.హాస కొత్తూర్ లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అడ్వకేట్ ఏలేటి గంగాధర్ వాళ్ళ అమ్మ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి గంగవ్వ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చౌట్ పల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ వాళ్ళ నాన్న చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు .నర్సాపూర్ గ్రామానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ జనార్దన్ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన సుధాకర్ చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్రంలో ఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని బిఎల్‌టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సిద్ధిరాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్ లో గల బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న బహుజన కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కనీస వేతనాలు అమలు చేయడంలో వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి బహుజన శ్రామిక వర్గాన్ని పెట్టుబడిదారులకు, కట్టు బానిసలుగా మార్చిందని ఆరోపించారు. అక్టోబర్‌లో అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం 26వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనాలు నిర్వహించబోతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్, నగర ప్రధాన కార్యదర్శి గంగా శంకర్, నగర ఉపాధ్యక్షులు విశ్వనాథ్ పాల్గొన్నారు.

జిల్లాకు వైరల్ ఫీవర్


జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

- విషజ్వరాలతో మంచం పట్టిన ప్రజలు
- బాధితులతో కిక్కిరిసిన ఆసుపత్రులు
- దగ్గు, జలుబు, బీపీ, షుగర్ మందులు కరువు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో విష జ్వరాలు పంజా విసురుతున్నాయి. వేగంగా విస్తరిస్తున్న డెంగ్యూ ఫీవర్, వైరల్ ఫీవర్ వల్ల పల్లె పట్టణాల తేడా లేకుండా ప్రజలు మంచం పడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు బాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో బీపీ, షుగర్, గ్యాస్, జలుబు, దగ్గు గోలీలు దొరకడంలేదని, దీంతో కొనుగోలు చేయాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

విష జ్వరాలతో నిజామాబాద్ జిల్లా వణికి పోతుంది. మారిన వాతావరణ పరిస్థితులకు తోడు అపరిశుభ్రత వల్ల వైరల్ ఫీవర్స్ పంజా విసురుతున్నాయి. పల్లె పట్టణాలు తేడా లేకుండా పట్టిపీడిస్తున్నాయి. సకాలంలో వైద్య సేవలు అందని దుస్థితి నెలకొంది. డెంగ్యూ మలేరియా వైరల్ బాధితులతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇదే అదునుగా భావించిన కొంతమంది లోకల్ డాక్టర్లు తెలిసి తెలియని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అధిక డోసు మందులను ఇస్తూ మరింత ముప్పు తీసుకువస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పి హెచ్ సి లలో ప్రభుత్వ వైద్యులు సిబ్బంది డెంగ్యూ విష జ్వరాల బారిన పడిన వారికి వైద్యం అందిస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో దోపిడి..

నిజామాబాద్ జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగ్యూ, విష జ్వరాల కారణంగా బాధితులు కిక్కిరిసిపోవడంతో ఇదే అదనుగా దోపిడి చేస్తున్నారు. కనీసం ఒక రోజైనా ఆసుపత్రిలో ఉంచుకొని బిల్లులు వేస్తున్నారు. మందులు, బ్లడ్ టెస్ట్‌ల పేరుతో దోచుకుంటున్నారు. అడ్డు అదుపు లేకుండా బిల్లులను వేస్తూ రోగుల నడ్డి విరుస్తున్నారు. దీనికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం స్పందించి తనిఖీలు చేపట్టి ఏ ఆసుపత్రిలో ఎలా చికిత్స అందిస్తున్నారు.. అదేవిధంగా ఎలా బిల్లులు వేస్తున్నారు ఏమిటి అని ఆరా తీయాల్సిన బాధ్యత ఉందని ప్రజలు, రోగాల బారిన పడిన బాధితులు జిల్లా యంత్రాంగాన్ని వేడుకుంటున్నారు.

జీజీహెచ్‌లో అస్తవ్యస్తంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి స్థాయి పెరిగినప్పటికీ వైద్య పరీక్షలకు సంబంధించిన సేవలు మెరుగుపడటం లేదు. కొన్ని రోజులుగా మలేరియా, చికున్ గున్యా పరీక్షలు నిలిచిపోయాయి. మందుల కొరత వేధిస్తోంది. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా ఇతర సీజనల్ వ్యాధులతో ప్లేట్ లేట్స్ కూడా తగ్గిపోతున్నాయి. రక్తంలో ఇన్‌ఫెక్షన్లు వస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో వ్యాధిని గుర్తించడంతో ఇన్‌ఫెక్షన్స్ తెలుసుకునేందుకు ముందుగా చేసేది రక్తపరీక్ష, దీంతో పాటు మరికొన్ని రక్తపరీక్షలు కూడా చేస్తారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు సుమారు 2000 వరకు అవుట్ పేషంట్ వస్తున్నారు. అలాగే రిపోర్టులు ఆలస్యంగా ఇస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదయం డాక్టర్లు పరీక్షలు రాసి రోగికి ఇస్తున్నారు. రోగి ల్యాబ్లో రక్తనమూనాలు ఇస్తున్నారు. కానీ రిపోర్టులు మాత్రం మరుసటి రోజు వస్తున్నాయి. దీనిని బట్టి ఒక రోగి రిపోర్టుల కోసం మరో రోజు కూడా రావలసి వస్తుంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి కారణాల వల్ల రోగులు ప్రభుత్వ ఆసుపత్రులకు రావాలంటేనే భయపడుతున్నారు.

మందుల కొరత......

సర్కారు దవాఖానాకు చికిత్స కోసం వచ్చే నిరుపేద రోగులకు మందుల కొనుగోలు పెను భారంగా మారుతోందని, ట్రీట్ మెంట్ వరకు ఉచితంగానే అందుతున్నా ఔషధాలు మాత్రం పూర్తి స్థాయిలో దొరకడం లేదని అంటున్నారు. సర్కారు నుంచి పలు రకాల మందుల సరఫరా కొద్దిరోజులుగా నిలిచిపోయింది. ముఖ్యంగా బీపీ, షుగర్, గ్యాస్, జలుబు, దగ్గు గోలీలు దొరుకడం లేదని, దీంతో చేసేది లేక కొనుగోలు చేస్తున్నామని రోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సెప్టెంబర్ 24వరకు 43,716 ఓపీ నమోదైంది. జ్వరాల బారిన పడి మొత్తం 2,565 మంది చికిత్సకు తీసుకున్నారు. 623 మంది పేషెంట్స్ అడ్మిషన్ అయ్యారని తెలిపారు. డెంగ్యూ పాజిటివ్ మొత్తం 82 వచ్చాయని అందులో 15 మంది చికిత్స తీసుకున్నారని వైద్యులు తెలిపారు.

రోజురోజుకు పెరుగుతున్న ఒపి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్



నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఫీవర్ వార్డు బాధితులతో నిండిపోయింది. రోజు 2000 పైగా ఓపి ఇక్కడ నమోదవుతూ వస్తుంది. ఇందులో 90 శాతం అవుట్ పేషెంట్లు ఫీవర్ల వల్లనే ఆసుపత్రికి వస్తున్నారు.. డెంగ్యూ జ్వరాలు కూడా జిల్లాలో పంజా విసురుతున్నయి. జిల్లాలో 350పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. జిల్లా కేంద్రంతో పాటు బోధన్ రూరల్ ప్రాంతంలో అధిక కేసులు నమోదు అవుతున్నాయి. విష జ్వరాలవల్ల రాష్ట్రంలోనే అధిక సంఖ్యలో ఓపి నమోదవుతుంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జనరల్ ఫిజీషియన్ క్రిటికల్ కేర్ అండ్ డయాబెటిక్ కౌన్సిలర్ డాక్టర్ జక్కా రవి



రోజురోజుకు పెరుగుతున్న విష జ్వరాల ద్వారా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి వాతావరణంలో మార్పుల వల్ల విష జ్వరాలు పెరుగుతున్నాయి. ఉదయం నుండి రాత్రి వరకు మోకాలు భాగం వరకు దోమలు కుడతాయి, అందుకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించాలి. మూడు నుండి ఐదు లీటర్ల నీటిని త్రాగాలి. ఇంట్లో నీటిని నిల్వ ఉంచకూడదు. ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలి. ఇమ్యూనిటీ పవర్ ఉన్నట్లయితే కొంతవరకు మనమే ఇంటి వద్ద ఉండి టాబ్లెట్లను వేసుకుని జ్వరాలను తగ్గించుకోవచ్చు.

1న ప్రపంచ వృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నూతన అంబేద్కర్ భవనంలో అక్టోబర్ 1న సీనియర్ సిటిజన్స్ డే (వయోవృద్ధుల దినోత్సవం) ఉంటుందని ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వయోవృద్ధుల శాఖ, దివ్యాంగుల శాఖ, ట్రాన్స్ జెండర్స్ శాఖ అధికారి రసూల్ బి అధ్యక్షతన సమా వేశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. సీనియర్ సిటిజన్ సభ్యులైన ఆల్ పెన్షనర్స్ హాజరుకావాలని కోరారు. ఈ సమావేశం లో కలెక్టర్‌తో వెల్ నెస్ సెంటర్, ఇతర ముఖ్యమైన విషయాలు మాట్లాడవచ్చని తెలిపారు.

వామ్మో కుక్కలు


రోడ్డుపై తిరుగుతున్న కుక్కలు

నవతెలంగాణ-మాక్లూర్

గ్రామాల్లో తిరగాలంటే ప్రజలు జంకుతున్నారు. చిన్నారుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. వీధి కుక్కల వల్ల చాలా మంది చిన్నారులను గాయపరిచిన ఘటనలు జరిగినా సంబంధిత అధికారులు ఏం చేయలేమని చేతులు ఎత్తేస్తున్నారు. వెంటనే వీధి కుక్కల కట్టడికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మధ్య కాలంలో మండల కేంద్రంలో ఓ చిన్నారిని కుక్కలు చుట్టు ముట్టగా, స్థానికులు గమనించి కుక్కలను చెదరగొట్టారు. నెల వ్యవధిలోనే మాక్లూర్ పిహెచ్ సిలో-03, కల్లెడ పిహెచ్‌సిలో-08, కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించిన వారు ఎంతోమంది ఉన్నారు. ద్విచక్ర వాహనాదారులు ప్రయాణించాలంటే భయపడుతున్నారు. శునకాలు వాహనాలను వెంబడిస్తున్నాయి. వీంతో మోటార్ సైకిళ్ల అదుపు తప్పి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. ఇకనైన అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం

- కుల నిర్మూలన సదస్సు

నవతెలంగాణ-(వేల్పూర్) ఆర్మూర్

అంతరాలు లేని సమాజాన్ని నిర్మిద్దాం అని సిపిఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి బి దేవారం అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే ఏర్పాటుచేసిన సత్యశోధక్ సమాజ్ నేటికీ 152 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా మండలంలోని అమీనాపూర్ గ్రామంలో ఆదివారం కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సబ్ డివిజన్ నాయకులు రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగ విచ్చేసిన డివిజన్ కార్యదర్శి దేవారాం మాట్లాడుతూ మహా త్మాపూలే సావిత్రిబాయి పూలే ఈ సమాజ మార్పు కోసం కులాలు లేని నవ సమాజం కోసం, అంతరాలు లేని వ్యవస్థ కోసం పోరాడారని తెలిపారు. కులం కుళ్ళు నశించాలని సత్యశోధక్ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా డివిజన్ నాయకులు రాజేశ్వర్, రాజన్న, అరవింద్, రామన్నపేట అంబేద్కర్ గ్రామ ప్రధాన కార్యదర్శి బాబురావు, అమీనాపూర్ మాజీ సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

విజయభారతి మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఆర్మూర్

విజయభారతి మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని మాజీ జడ్పీ చైర్మన్, న్యాయవాది గంట సదానందం ఆదివారం తెలిపారు. భీమన్న బిడ్డగా బొజ్జ తారకం సతీమణిగా రాహుల్ బొజ్జ తల్లిగా, పేద ప్రజలందరికీ ఆత్మీయురాలిగా, తెలుగు సాహిత్యానికి ఆదర్శమూర్తిగా, బొజ్జ తారకం చేదోడు వాదోడుగా ఉంటూ వారి వద్దకు వచ్చే బడుగు జీవులను ఆదరించి అన్నం పెట్టిన పుణ్యమూర్తి అని అన్నారు. వారి జీవిత ప్రస్థానం నిజామాబాద్ జిల్లా నుండి మొదలైందని తెలిపారు.

క్రీడల ప్రోత్సాహానికి సహాయం అందిస్తాం

- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాబోయే రోజుల్లో మండలంలో క్రీడల ప్రోత్సాహానికి మానాల ట్రస్టు ద్వారా సహాయం అందిస్తామని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈసందర్భంగా మానాల మాట్లాడుతూ.. రాబోయే ఐదు సంవత్సరాలు మండల క్రీడల నిర్వహణకు నిర్వాహకులకు రూ.25వేలు, ఛాంపియన్ గా నిలిచిన మొదటి పాఠశాలకు రూ.పదివేలు, రెండవ విజేతకు రూ. 5వేలు మానాల ట్రస్టు ద్వారా అందిస్తామని ప్రకటించారు. ఈ సంవత్సరం ఛాంపియన్ గా నిలిచిన చౌట్ పల్లి ఉన్నత పాఠశాలకు రూ. పదివేలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, వైస్ చైర్మన్ సుంకేట బుచ్చన్న, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, క్రీడల కన్వీనర్ పసుపుల సాయన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పిఈటిలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్‌గా చౌట్‌పల్లి

మండల అంతర్ పాఠశాలల క్రీడల్లో అత్యధికంగా ఎనిమిది బహుమతులు గెలుచుకొని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కోన సమందర్ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల విద్యార్థులు ఎనిమిది, శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు కూడా ఎనిమిది బహుమతులు గెలుచుకున్నారు. బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడు బహుమతులు, విజ్ఞానజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు నాలుగు బహుమతులు


బహుమతిని అందుకుంటున్న క్రీడాకారులు

గెలుపొందారు. హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడు బహుమతులు గెలుపొందగా, కమ్మర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మిసిమి ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు ఒక్కో బహుమతి గెలుపొందారు. విజేత జట్లను బహుమతుల ప్రధానం కార్యక్రమంలో పాల్గొన్న ఆహుతులు అభినందించారు.

కష్టజీవుల రాజ్యం ఏర్పడితేనే పేదల సమస్యలు తీరుతాయి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కష్టజీవుల రాజ్యం ఏర్పడితేనే పేదల సమస్యలు తీరుతాఅని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు అన్నారు. ఆదివారం నగరంలోని బహుజన కాలనీ పార్టీ శాఖ మహాసభ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కానీ తమ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి తప్ప పేద ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఏమాత్రం శ్రద్ధ చూపటం లేదని అన్నారు. ఫలితంగా నిత్యవసర సరుకుల ధరలు పెరగటంతో ప్రజల ఆదాయాలు పెరగకపోవటంతో పేదరికం మరింత పెరుగుతున్నదని అన్నారు. నిరుద్యోగం తాండవిస్తుందని, ఆదాయాలు పడిపోతున్నాయని మరొకవైపు ప్రపంచంలోకెల్లా అత్యంత ధనవంతులు మన వారే ఉంటున్నారని తెలిపారు. దీనివల్ల దేశంలో పేదవారు మరింత పేదలుగా ని ధనికులు అత్యంత ధనవంతులుగా మారి ప్రజల కష్టాలు పెరుగుతున్నాయని అన్నారు. కష్టజీవుల రాజ్యం ఏర్పడితే తప్ప సమస్యలు పరిష్కారం కావని, అందుకొరకు పేద ప్రజలందరూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ఐక్యంగా పోరాటాలు నిర్వహించి ప్రజా వ్యతిరేక


జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వాలను ఓడించి కష్టజీవుల రాజ్యం అధికారంలోకి తెచ్చుకోవటమే ఏకైక మార్గమని ఆయన అన్నారు. అందుకోసం తక్షణ సమస్యల పరిష్కారంతోపాటు దీర్ఘకాలిక సమస్యలపై కష్ట జీవులను ఐక్యం చేయాలని పిలుపునిచ్చారు. మూడు సంవత్సరాలు కాలంలో పార్టీ నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవడంకోసం వార్డు స్థాయి నుండి అఖిలభారత స్థాయి వరకు మహాసభలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు సుజాత, బహుజన కాలనీ శాఖ సభ్యులు రజియా, పద్మ, అలీభాయ్, రిజ్వాన్, పర్వీన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఆదివారం కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన మార్కెట్ చైర్మన్ పాలెపు నర్సయ్యను ఘనంగా సన్మానించారు. గ్రామ మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకేట రవి, డాక్టర్ మురళి, కే. శ్రీనివాస్, ఎస్. శంకర్, ఎం. రవి, ఏ. సంజీవ్, వి. దేవేందర్, ఎస్. సుమన్, కే. సంపత్, పి. ముఖేష్, తుక్కడు చిన్నయ్య, ఆశన్న, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కెనాల్‌గోడ

- మొరం టిప్పర్ ఢీకొనడంతో ధ్వంసం


టిప్పర్ ఢీకొనడంతో కెనాల్‌గోడ ధ్వంసం

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలం కేంద్రానికి వెళ్లే రహదారి పక్కన గల కెనాల్ వాలు గోడని మూడు నెలల క్రితం మొరం తరలిస్తున్న ట్రిప్పర్ ఢీకొంది. టిప్పర్ కూడా కెనాల్‌లో పడేది కానీ తృటిలో పమాదం తప్పింది. ఆ ట్రిప్పర్ డ్రైవింగ్ చేసే వ్యక్తి నిర్లక్ష్యం వల్ల కెనాల్ పక్కన గోడ కూడా మధ్యలో కూలిపోయింది. ట్రిప్పర్‌కి సరైన పత్రాలు లేవు కనీసం డ్రైవింగ్ చేసిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేదు. ఆ రోడ్డు వెంబడి వెళ్లే వాహనదారులకి రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉంది. ఒకవేళ రాత్రి సమయంలో అదుపుతప్పితే కెనాల్‌లోనే పడిపోతారు. ఇప్పటికైనా రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి గోడ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఫూలాంగ్ వాగును కాపాడండి

- టీపీసీసీ చీఫ్‌కు మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఫూలాంగ్ వాగును కాపాడాలని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ బి.కేశవులు టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్‌ను ఎంఎల్‌ఏ క్వార్టర్‌లో ఆదివారం కలిసి

వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఫులాంగ్ వాగు ఆక్రమణ ల గూర్చి టీపీసీసీ చీఫ్ కు వివరిస్తూ నిజామాబాద్ నడి బొడ్డున గల ఫూలాంగ్ వాగు గాయత్రి నగర్ నుండి ముబారక్ నగర్ వరకు పూర్తిగా అక్రమ నిర్మాణాలతో కబ్జాకు గురైందన్నారు. ఫలితంగా వర్షాకాలంలో చిన్నపాటి వర్షాలకే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. నగర శివారులోని నిజామాబాద్- బోధన్ రహదారి పక్కనే రామర్తి చెరువు శిఖం కొంతకాలంగా కబ్జాకు గురవుతున్న పట్టించుకున్న వారే లేరని అన్నారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా మిగిలిన ప్రాంతానికి ఫెన్సింగ్ చేసి చేతులు దులుపుకున్నారని తెలిపారు. నాగారంలోని బొందెం చెరువు ఆక్రమణలపై కూడ పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన హైడ్రా తరహాలోనే అన్ని జిల్లాల్లో కూడా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటిలను ఏర్పాటు చేసి చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల్లోని గుట్టల కబ్జాలను తొలగించబోతున్నట్లుగా ఇటీవల ఖమ్మంలో ప్రకటించారన్నారు. నిజామాబాద్ జిల్లాల్లో కూడా హైడ్రా తరహాలోనే వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కోరారు.


వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ కేశవులు

మండల ఉపాధ్యక్షునికి అభినందనలు తెలిపిన గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఇటీవల జరిగిన అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీలో ఎల్లారెడ్డి మండల ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రుద్రారం గ్రామానికి చెందిన పద్మారావుకు ఆదివారం పలువురు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కమిటీలో రుద్రారం గ్రామం తరపు నుంచి చోటు దక్కినందుకు హర్షం వ్యక్తం చేశారు. బహుజన వర్గాల ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని, నిస్సహాయులకు అండగా నిలవాలని సూచించారు. ప్రజాసేవలో ముందుకు సాగుతూ మంచి వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సంజీవ్, సాయిబాబా, రాజు, సాయిలు, శీను, వెంకటరాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో బోనాల పండుగ


రెంజల్‌లో..

నవతెలంగాణ-రెంజల్/ఎడపల్లి

మండలంలోని బోర్గం గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి బోనాలను ఎత్తుకొని గ్రామంలోని గ్రామ దేవతలకు అభిషేకాలు నిర్వహించారు. పంటలు చేతికి వచ్చే ముందు గ్రామంలో సలి కడలను తీయడం ఆనవాయితీగా వస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ఎడపల్లిలో

ఎడపల్లి : మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు డప్పు వాయిద్యాల మధ్య గ్రామ దేవతల ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



సమయానికి రాని ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆర్టీసీ బస్సులు సమయానికి రావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కామారెడ్డి-నిజాంసాగర్ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులు ఆదివారం ఉదయం బస్సు కోసం ఎదురుచూస్తూ సమయానికి బస్సులు రాకపోవడంతో తీవ్రమైన అసౌకర్యానికి గురైనట్టు తెలిపారు. ప్రతిరోజు కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి మీదుగా నిజాంసాగర్, పిట్లం వెళ్లే బస్సులు సమయపాలన పాటించడం లేదని గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తుందని అంటున్నారు. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి వరుసగా 2, 3 బస్సులు వస్తున్నాయని, వాటి సమయ వేళలు నిమిషాల వ్యవధిలో ఎలా ఉంటాయని ప్రశ్నిస్తున్నారు. సమయపాలన పాటించకుంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని ప్రయాణికులు అంటున్నారు.

పొగాకు సాగుకు ఆసక్తి

- గుంటూర్ విఎస్‌టి కంపెనీతో ఒప్పందం
- భూములు చదును చేస్తున్న రైతులు
- నారుపోసిన విక్రయిస్తున్న పలువురు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గాం, కందకుర్తి, నీలా, పేపర్‌మిల్ గ్రామాల్లోని రైతాంగం పొగాకు పంట సాగుపై దృష్టి సారించింది. ఇందుకోసం రైతులు తమ భూములను చదును చేసి సిద్ధం చేస్తున్నారు. పొగాకు పంట సాగుకు గుంటూరు నుంచి విఎస్‌టి కంపెనీతో పాటు, వివిధ కంపెనీలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడంతో రైతాంగం ఆ పంటపై దృష్టి సారించింది.


పొగాకు సాగు చేస్తున్న రైతులు

పొగాకు సాగుకోసం ఎకరానికి సుమారు రూ.లక్షా 30 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. అయితే పొగాకు పంట అధిక దిగుబడి సాధిస్తే సుమారు రూ.రెండు లక్షల 50 వేలపైనే ఆదాయం వస్తుందని రైతులు పేర్కొన్నారు. గతంలో కంపెనీలు బాండ్ల రూపంలో కొనుగోలు చేసేవారని, దీంతో కొంతమంది రైతులు మాత్రమే పొగాకు పంట సాగుపై దృష్టి సారించేవారు. కానీ ప్రస్తుతం పలు కంపెనీలు వస్తూ ఉండడంతో సన్న చిన్న కారు రైతులు సైతం పొగాకు పంట సాగుపై ఆసక్తిని కనబరుస్తున్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి

- పిఆర్‌టియు మండల అధ్యక్షులు సోమలింగంగౌడ్


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-రెంజల్

ప్రతి ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని పిఆర్టియు మండల అధ్యక్షులు టి.సోమలింగం గౌడ్ స్పష్టం చేశారు. రెంజల్, నవీపేట్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన గణేష్ రావుకు ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు తమ విధి నిర్వహణలో విద్యార్థులకు ఉత్తమ బోధనలు అందిస్తూ వారిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెంజల్ మండలానికి ఆయన అందించిన సేవలు మరువలేనివని, ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖ అధికారి బాధ్యతలను చేపట్టి అనేకమంది విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకు ఉందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు బి.వెంకటలక్ష్మి, పిఆర్టియు మండల అధ్యక్షులు సోమలింగంగౌడ్, ఉపాధ్యాయులు కృష్ణ, నరేష్, రాజేశ్వర్, రాధా, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులు సొసైటీ అభివృద్ధిలో భాగం కావాలి

- హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి

నవతెలంగాణ-బోధన్


మాట్లాడుతున్న హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి

రైతులు సొసైటీలో సభ్యులుగా నమోదై సొసైటీ అభివృద్ధికి పాటుపడాలని హున్సా సొసైటీ చైర్మన్ మందర్న రవి అన్నారు. ఆదివారం సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల కాలంలో నిర్వహణ కంటే ప్రస్తుత పాలకవర్గంలో సొసైటీ అభివృద్ధికి ఎన్నో పనులు చేపట్టామని తెలిపారు. పంటల కొనుగోలుపై 70 లక్షలకుపైగా కమీషన్ పొందినట్టు చెప్పారు. అలాగే రైతులు తీసుకెళ్లిన గన్నీ బ్యాగులు తిరిగి ఇవ్వడం లేదని దాంతో సొసైటీకి నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు వారి అవసరాల కోసం తీసుకువెళ్లిన గన్నీ బ్యాగులను తిరిగి అప్పగించాలని సూచించారు. సొసైటీ ద్వారా అందించే సేవలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్‌ఫ్లవర్ పంట కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేశామని, అలాగే సకాలంలో రైతులకు ఎరువులు అందించామని తెలిపారు. కొత్త పాలకవర్గం ఏర్పడినప్పుడు 50 లక్షలు బ్యాలెన్స్ ఉండగా అనంతరం కోటి 50లక్షల కమీషన్ లాభంగా వచ్చిందన్నారు. గన్ని సంచులు కొనుగోలులో నాణ్యత లేకపోవడంతో సొసైటీకి నష్టం వాటిల్లిందని కావున రైతులు ఇబ్బంది పడకూడదని అన్నారు. ఇంతవరకు ఏ సొసైటీలో కూడా లేని విధంగా తొలిసారిగా కొంతమంది రైతులకు క్వింటాలుకు రూ.50 అదనంగా కొనుగోలుపై ఇచ్చినట్టు తెలిపారు. సొసైటీలో ప్రతి రైతు కూడా సభ్యత్వం తీసుకొని సొసైటీ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సొసైటీ పాత సభ్యులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రూ.500 చెల్లించి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అలాగే ఖాజాపూర్, హున్స, మంధర్న గ్రామాలలో చెరుకు పంట పండించిన రైతులకు రుణమాఫీ జరగలేదని కావున వారికి రబీ పంటలకు అయినా రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సొసైటీ సెక్రెటరీ హనుమంతరావు సొసైటీ పరిధిలో నిర్వహించిన లావాదేవీలను, ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. వైస్ చైర్మన్ కులకర్ణి వినోద్ రావు, డైరెక్టర్లు ముద్ద సంగారం, గుమ్మడి భూమన్న, దేశ్‌పేట్ రాములు, మురుగే మాధవరావు, మర్కల్ శివకుమార్, చిద్రపు అశోక్, చింతం మైసయ్య, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు సరే..
కనెక్షన్ ఏది..?

- స్కూల్‌లో నీటి ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వని కాంట్రాక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మన ఊరు - మన బడి కార్యక్రమంలో ఎంపిక య్యింది. అందులో భాగంగా రంగులతో సుందరంగా ముస్తాబు చేశారు. విద్యార్థులకు తాగునీటి కోసం తాగునీటి ట్యాంకు, వాష్ బేసిన్ ఏర్పాటు చేశారు. అంత వరకు బాగానే ఉంది. కానీ వాటర్ ట్యాంకుకు నీటి కనెక్షన్ మాత్రం ఇవ్వలేదు. దాంతో ట్యాంకులో నీరు లేకపోవడంతో వాష్ బేసిన్ సైతం వృథాగా మారింది. విద్యార్థులు భోజనం చేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోడానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. దాంతో పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్‌కు చెందిన తాగునీటిని విద్యార్థులు వాడుకుంటున్నారు. ఈ విషయమై ఇంచార్జి హెచ్‌ఎం సందీప్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో ట్యాంకుకు నీటి కనెక్షన్ ఇవ్వకుండా పనులు నిలిపి వేశారని అన్నారు. హాస్టల్‌కు సంబంధించిన నీటిని వాడుకుంటున్నామనే ధోరణితో పాఠశాల ఉపాధ్యాయులు ఈ ట్యాంకు సమస్యను కనీసం అధికారుల దృష్టికి తీసుకెళ్లకపోవడం గమనార్హం. పాఠశాలకు లక్షల నిధులు వెచ్చించి అభివృద్ధి చేసిన కనీసం విద్యార్థులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని విమర్శలు వస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్యాంకుకు నీటి కనెక్షన్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శుద్ధమైన నీటిని అందించాలని పలువురు కోరుతున్నారు.


వృథాగా మారిన నీటి ట్యాంకు

రెజ్లింగ్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థులు


పోటీల్లో సత్తా చాటిన విద్యార్థుల

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్ పోటీల్లో బాన్సువాడ డివిజన్‌లోని నసురుల్లాబాద్ ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన క్రీడాకారులు సత్తా చాటారని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ రావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని నిజామాబాద్ జిల్లా మంచిప్ప గ్రామంలో ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ ఒక్క రోజు పోటీలు నిర్వహించారు. వన్ డే రెజ్లింగ్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా కామారెడ్డి నిజామాబాద్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాల నుండి వివిధ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో నసురుల్లాబాద్ గిరిజన గురుకుల పాఠశాలలో విద్యాభ్యాసం చేసే అండర్ 14 బాలుర విభాగంలో కుమ్లా 35 కేజీల బరువుతో బంగారు పతకం సాధించగా, అండర్ 17 బాలుర విభాగంలో జైపాల్‌కు 48 కేజీల బరువులో వెండి పతకం సాధించారు. కళ్యాణ్ 51 కేజీల బరువులో వెండి పతకం సాధించగా, బలరాం 60 కేజీల బరువుతో కాంస్య పతకం సాధించాడు. దీంతో కుమ్లా, జైపాల్, కళ్యాణ్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మాధవ రావు తెలిపారు. టోర్నమెంట్‌లో వివిధ పతకాలు సాధించిన క్రీడాకారులకు వీరికి ప్రోత్సాహం శిక్షణ ఇచ్చిన పిఇటిని అభినందించారు. విద్యతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని క్రీడాకారులకు సూచించారు. వీరి వెంట విద్యార్థులు ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-బిచ్కుంద


మృతి చెందిన కాశవ్వ

బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన గోనే కాశవ్వ (60) తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు. మృతురాలు గోనె కాశవ్వ తన ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉండడంతో ఎదురింటిలో ఉంటున్న భూదేవ్వ గమనించి చుట్టుపక్కల వాళ్లకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గోనె కాశవ్వ మృతి చెంది ఉంది.ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు.

ఐసీడీఎస్ కార్యక్రమాలను
సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మహిళ శిశుసంక్షేమ అధికారిణి రసూల్ బీ

నవతెలంగాణ-బోధన్


గర్భిణులకు సీమంతాలు నిర్వహించిన దృశ్యం

ఐసీడీఎస్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళ శిశుసంక్షేమ అధికారిణి రసూల్ బీ తెలిపారు. ఆదివారం మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ మాసంలో భాగంగా ప్రాజెక్ట్ లెవల్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారిణి రసూల్ బీ హాజరై మాట్లాడారు. ఐసీడీఎస్ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీ, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ జానకి, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, మహిళా శక్తి కో ఆర్డినేటర్ స్వప్న, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో
దుకాణాల నిర్వహణకు నేడు వేలం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి (రామారెడ్డి) లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయ ప్రాంగణంలో కిరాణం, టెంకాయలు, స్వామి వారి లడ్డు, పులిహోర, పూజా సామగ్రి, వడ మొదలగు వాటికి రెండు దుకాణాలకు నవంబర్ 1వ తేదీ నుంచి సంవత్సరం పాటు టెండర్‌కు గానూ ఆలయ ప్రాంగణంలో ఈనెల 30న ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో ప్రభు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్తులు వేలంపాటలో పాల్గొనాలని, షరతులు వేలం సమయంలో తెలుపబడునని పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-కామారెడ్డి


రాజవ్వ (ఫైల్)

కామారెడ్డి జిల్లాలోని రాజంపేట్ మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు ఆదివారం కన్నుమూశారు. గ్రామానికి చెందిన కందారపు రాజవ్వ వయస్సు (105). రాజవ్వకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, ఆరుగురు మనుమల్లు, ముగ్గురు మనుమరాళ్లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శతాధిక వృద్ధురాలు రాజవ్వ మృతితో కాలనీలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా సన్నధాన్యానికి, దొడ్డు ధాన్యానికి రూ.500ల బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చెయ్యాలని, పత్తి పంట కొనుగోలుకు సిసిఐ తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.15వేలు మద్దతు ధర చెల్లించాలని, పత్తికి రూ.500 బోనస్ ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వుప్పల ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, జిల్లా నాయకులు పడాల శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరి చేయాలని డిమాండ్ చేశారు.

మల్లికార్జున స్వామి కళ్యాణ మండపానికి విరాళం

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని దేవునిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి కళ్యాణ మండపం నిర్మాణానికి మాదిగ సంక్షేమ సంఘం తరపున రూ.11,116 విరాళం అందజేశారని దేవునిపల్లి వీడీసీ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా మాదిగ కుల సంక్షేమ సంఘ సభ్యులు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలు వివాహాది శుభకార్యాలకు వినియోగించుకునేందుకు వీలుగా నిర్మిస్తున్నందున నిర్మాణంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. దేవునిపల్లిలో ఉన్న ప్రతి ఒక్కరూ, ప్రతి ఒక్క కుల సంఘం సభ్యులు మమేకమవ్వాలని వీడీసీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వీడిసి అధ్యక్షులు స్వామి, ఉపాధ్యక్షులు రాజు పాటిల్, కార్యదర్శి నవీన్, ప్రతినిధులు గంగారం, బాలయ్య, మాదిగ కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దండు లింగం, సభ్యులు రాజలింగం, శ్రీనివాస్, బోడోల్ల రాజయ్య, ప్రవీణ్, సాయిలు, రాములు, నర్సింలు, చిన్న నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహీ సేవకు అనూహ్య స్పందన

- ఎన్‌హెచ్ అధికారి శ్రీధర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తుందని జాతీయ రహదారి అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. ఆదివారం బాన్సువాడ మండలంలోని సోమేశ్వర గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించామని ఎన్‌హెచ్ 765 జాతీయ రహదారి అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీధర్ తెలిపారు. నేడు ఎన్‌హెచ్ 765 జాతీయ రహదారి సిబ్బందితో ప్రతిజ్ఞ చేశారు. అలాగే సోమేశ్వర గ్రామంలో అపరిశుభ్రత చెత్తాచెదారం తొలగించారు. మురికి కాలువలను శుభ్రం చేశారు. దీంతో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమానికి మంచి స్పందన కల్గిందన్నారు. ఎన్‌హెచ్ 765 జాతీయ రహదారి సిబ్బందితో తదితర గ్రామాల్లో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. గ్రామాల్లో స్వచ్ఛత ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలు జరగనున్నాయని స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత నినాదంతో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మహాత్ముని జయంతి వేడుకల సందర్భంగా ప్రతి పంచాయతీల్లో స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ 765 జాతీయ రహదారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్కినగర్ అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-కామారెడ్డి

కల్కినగర్ అభివృద్ధి లక్ష్యంగా (కేడిసి) కల్కినగర్ డెవలప్‌మెంట్ కమిటీని నూతంగా ఏర్పాటు చేసినట్టు అధ్యక్షులుగా ఎన్నికైన పోతారాజు వెంకటేష్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా నిట్టు రఘు, టి.ఎన్.చారి, ఏనుగు నరేందర్‌రెడ్డి, కాసర్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా బాజా లలిత, సంయుక్త కార్యదర్శులుగా ఆకుల సుధాకర్, బి.రమేష్, కె.మోహన్‌గౌడ్, ఎల్లంకి సంతోష్, కోశాధికారి మనోజ్ కుమార్, సలహాదారులుగా ఆమెటి రమేష్, ఆకుల నారాయణ, చల్ల సుధాకర్, తోట సంగమేశ్వర్, టి.వేణుగోపాల్, బి.సంగమేశ్వర్, మన్నె శ్రీరామ్, శ్రీధర్ పంతులు, పి.ప్రశాంత్, రామచంద్రం, బోనాల రమేష్, ఎ.సుధాకర్, వి.నాగభూషణం, వీరమల్లి ప్రభాకర్, మేదరి లక్ష్మి, తిరుపతిరెడ్డి, ఎన్.భూమయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటల్లోనూ నైపుణ్యం

- గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఎడపల్లి


పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలు

చదువుతోపాటు ఆటల్లోనూ నైపుణ్యం కనబరుస్తున్నారు ఎడపల్లి పరిధిలో గల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాల విద్యార్థులు. పి. రుచిత బైపీసీ మొదటి సంవత్సరం, పి.పూజ ఎంపీసీ మొదటి సంవత్సరం అనే విద్యార్థులు 2024-2025 విద్య సంవత్సరానికి గానూ నిజామాబాద్ జిల్లా స్థాయిలో నిర్వహించిన యువజన పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. పి.రుచిత జానపద విభాగంలో జిల్లాస్థాయిలో బహుమతి సాధించింది. పి. పూజ చిత్రలేఖనం పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయిలోనే మొదటి బహుమతి సాధించింది. అంతేకాకుండా రాష్ట్రస్థాయిలో నిర్వహించే చిత్రలేఖనం పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థులను గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ గంగా శంకర్‌తో పాటు, ఉపాధ్యాయ బందం అభినందించారు.

క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని చేపూర్ గ్రామం శివారు క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జిల్లా 12వ ఎన్‌సిసి బెటాలియాన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టెంట్ కల్నల్ విష్ణుప్రకాష్ సూచన మేరకు ఎంపికలు నిర్వహించినట్టు కళాశాల వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఫిజికల్ టెస్టులు, రాత పరీక్షలు నిర్వహించి 15 మంది సీనియర్ డివిజన్ బాయ్స్, 12 మంది సీనియర్ గర్ల్స్ విద్యార్థులను ఆర్మీ నాన్ కమిషన్ ఆఫీసర్స్ సుబేదార్ మేజర్ హర్‌ప్రీత్ సింగ్ నాయక్ సుబేదార్ జాస్వల్ సింగ్, కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టెనెంట్ వెంకటేష్ సెలెక్ట్ చేశారు.

భావ ప్రకటన నైపుణ్యం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది

- **ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్**

నవతెలంగాణ-ఆర్మూర్

భావ ప్రకటన నైపుణ్యం ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాల కరస్పాండెంట్ మానస గణేష్ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని గాంధీనగర్ పాఠశాలలో నిర్వహించిన " కాన్ఫిడెన్స్ త్రూ కమ్యూనికేషన్-భావ ప్రకటన నైపుణ్యంతో ఆత్మ విశ్వాసం" అనే కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భయాన్ని వీడి ఒక సమూహంలో గాని ఒక స్టేజ్ మీద గాని ధైర్యంగా మాట్లాడినప్పుడు తమ ఆత్మ గౌరవం పెరుగుతుందన్నారు. పాఠశాల పాలనాధికారిని పద్మ మాట్లాడుతూ.. అభ్యాసంతో అందరికీ పరిపూర్ణత సాధ్యమవుతుందని తెలిపారు. కావున శిక్షణలో నేర్చుకున్న మెలుకువలను క్రమం తప్పకుండ నిరవధికంగా అభ్యాసం చేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు వైద్య శిబిరం



నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రాఫిక్ పోలీసులకు వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు సందీప్ రావు, ఛాతి వైద్య నిపుణులు రాజేంద్రప్రసాద్ హాజరై ట్రాఫిక్ పోలీసులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె వైద్య నిపుణులు సందీప్ రావు, ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ బొద్దుల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో పాటు వ్యాయామానికి సమయం కేటాయించాలని సిబ్బందికి సూచించారు. కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉండే ఆహారం, అధిక తీపి, జంక్ ఫుడ్ తీసుకోవడం మానేస్తేనే ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, బోధన్ ఇంచార్జ్ ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు విజయరావు, క్లబ్ కార్యదర్శి గంగారెడ్డి, గురుప్రీత్ సింగ్, పవన్ పాండే, జితేంద్రమలాని, సతీశ్ షాహ, బాబురావు, పార్సి రాజేశ్వర్, రాజ్కుమార్ సుబేదార్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

వీడీసీ సభ్యులకు సన్మానం



వీడీసీ సభ్యులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

వీడిసి సభ్యులకు పలువురు ఘనంగా ఆదివారం సన్మానించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన విడిసి అధ్యక్షుడు కందారం రమేష్, కోశాధికారిగా ఆరేపల్లి గంగాధర్‌లను శుభాకాంక్షలు తెలిపారు. పదవ తరగతి పూర్వ విద్యార్థులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాల్కొండ గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు ముందు ఉండాలని వారు కోరారు.

ఎంఈవోకు ఘన సన్మానం

నవతెలంగాణ-ముప్కాల్

ఇటీవల ముప్కాల్ మండల విద్యాధికారిగా పదోన్నతి పొందిన రెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కుల రవికుమార్‌ను ఎఫ్పీఎస్టీ ఆర్మూర్ డివిజన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్పిఎస్టి జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి రఘునాథ్, ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యాయులు పోచన్న, రాజేందర్, నరేష్, సాయన్న రాంకిషన్, మురళి, శ్రీనివాస్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీ చేసిన జగన్మోహన్‌రెడ్డిని అరెస్టు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తిరుమల శ్రీవారి పుణ్యక్షేత్ర లడ్డూ మహా ప్రసాదన్ని కల్తీ చేయించిన జగన్మోహన్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని నిజామాబాద్ పార్లమెంట్ మాజీ అధ్యక్షులు దేగం యాదగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రం ఎన్టీఆర్ చౌరస్తాలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జగన్ మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కల్తీకి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, అంబిక సత్యనారాయణ, బ్రహ్మానంద చారి, బోబ్బ నరసింహ రావు పాల్గొన్నారు.


పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ కన్వీనర్‌గా జెస్సు అనిల్ కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బిజెపి అసెంబ్లీ కన్వీనర్‌గా జెస్సు అనిల్ కుమార్ నియామకం అయ్యారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నియామకానికి సహకరించిన ఎంపీ ధర్మపురి అరవింద్ శాసనసభ్యులు పైడి రాకేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచానిలకు ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్‌కు కృషి చేస్తానని అన్నారు.

పట్టణ ఏసీపీగా వెంకటేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



స్వాగతం పలుకుతున్న ఎస్‌హెచ్‌వో

పట్టణ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఏసీపీగా పనిచేసిన బస్వారెడ్డి అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన ఏసీపీకి స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి పరామర్శ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తొర్తి గ్రామానికి చెందిన భూమేష్ వాళ్ళ తమ్ముడు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి బాధిత వ్యక్తి ఇంటికి వెళ్ళి పరామర్శించి,ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సోమ దేవరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కార్యకర్తలు ఉన్నారు.

క్రీడలు ఎంతో అవసరం

- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి**
- **మండల స్థాయి క్రీడల ప్రారంభం**

నవతెలంగాణ - భీంగల్ రూరల్

మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యకరమైన జీవితానికి, ఉన్నతంగా కెరియర్ తీర్చిదిద్దుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలు అనేవి కేవలం ఫిట్ నెస్ కోసమే కాదు.. జీవితంలో మనకు ఎదురు దెబ్బలు తగిలినపుడు వాటిని తట్టుకొని నిబ్బరంగా, మనో ధైర్యంగా ఉండటానికి క్రీడలు ఉపయోగపడతాయని

మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కృషి హై స్కూల్ స్టేడియంలో ఆదివారం ఎస్‌జీఎఫ్ మండల అంతర పాఠశాల క్రీడోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థుల మార్చ్ ఫాస్ట్ గౌరవ వందనం స్వీకరించారు. నాతో పాటు చిన్నప్పుడు ఆడిన ఎందరో ఇప్పుడు జిల్లాలో ఫిజికల్ డైరెక్టర్లకు క్రీడల మీద ఉన్న మక్కువతోనే జిల్లాలో, గ్రామీణ స్థాయిలో గొప్పగా క్రీడలు నిర్వహించు కోగలుగుతున్నా మన్నారు. జీవితంలో స్థిరపడటానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని తెలిపారు. ఈ ఆటలకు బహుమతులు, ఇతర అవసరాలకు దాతగ ముందుకొచ్చిన పద్మ జగదీష్‌ను అభినందించారు. ఈ ఆటలకు ఆతిధ్యం ఇచ్చిన రవీందర్ రెడ్డి మా స్వంత గ్రామం నుండి వచ్చిన వారని అన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల మార్చ్ ఫాస్ట్, కల్చరల్ ప్రోగ్రామ్స్ అలరించాయి. మార్చ్ ఫాస్ట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు.



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వేముల

మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కె రన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రపంచ హృదయ (గుండె) దినోత్సవాన్ని పురస్కరించుకుని గుండె జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 2కె రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ రన్‌ను నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తాలో వైద్యులు జీవన్‌రావు, వెంకట రమణలు జండా ఊపి ప్రారంభించారు. ఈ రన్ గాంధీచౌక్ నుండి ఎల్లమ్మగుట్టలోని మెడికవర్ ఆసుపత్రికి చేరుకుంది. అనంతరం మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు సందీప్ రావు, రవి కిరణ్‌లు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో వృద్ధులలోనే కాకుండా యువతలో కూడా గుండె జబ్బుల ప్రమాదం వేగంగా పెరుగుతోందన్నారు. హృదయ సంబంధ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణమౌతున్నాయన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితం ఇందుకు ప్రధాన కారణాలని తెలిపారు. వాకింగ్, జాగింగ్ లేదా సైక్లింగ్ వంటి 30 నిమిషాల శారీరక శ్రమను ప్రతిరోజూ చేయడం వల్ల గుండెను బలపరుస్తుందని, శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా చేస్తుందని తద్వారా ఊబకాయం, రక్తపోటు, కొలెస్ట్రాల్ను నియంత్రిస్తుందని తెలిపారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల్య ఆహారం చాలా ముఖ్యమని, జంక్‌ఫుడ్, చక్కెర, అధిక కేలరీల ఆహారాన్ని నివారించాలన్నారు. సంవత్సరానికి ఒక్కసారి అయిన ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ 2కె రన్‌లో ఆస్పత్రి ఇన్‌చార్జి స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్‌కుమార్, మేనేజర్ సాయి ప్రసాద్, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



2కె రన్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

ఉత్తమ ఉపాధ్యాయురాలు రాధకు సన్మానం

నవతెలంగాణ-ధర్పల్లి

గురుపూజోత్సవం సందర్భంగా ట్రస్మా ఆధ్వర్యంలో ఆదివారం నగర శివారులో బృందావన్ గార్డెన్‌లో నిర్వహించిన ప్రైవేట్ విద్యాసంస్థల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నలు మూలలనుండి సుమారు 2వందల 50 విద్యాసంస్థల వారు పాల్గొన్నారు. ఈసంద ర్భంగా ధర్పల్లి మండలం లోని దుబ్బాక గ్రామంలోని శ్రీ విద్య పాఠశాల ఉపాధ్యాయురాలు టి. రాధకు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నిక కావడంతో ఆమెకు ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఘన సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి దుర్గ ప్రసాద్, ప్రత్యేక ఆహ్వానితులుగా యాదగిరి శేఖర్ రావు, రాష్ట్ర ట్రస్మా అడ్వైజర్ మధుసూదన్, రాష్ట్ర అధ్యక్షుడు సేపూర్ జయసింహగౌడ్, జిల్లా అధ్యక్షులు రాస నిత్యానందం, సెక్రటరీ గోజూరి అరుణ్, కోశాధికారి ఉప్పల మధు, దుబ్బాక శ్రీ విద్య సంస్థ చేర్మెన్ గోదూరి గంగాధర్, కారస్పెండెంట్ సాయి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు రాధను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, ట్రస్మా

బాలచెలిమి గ్రంథాలయం ఏర్పాటుకు సహకారం

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి, చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ వారు సంయుక్తంగా గ్రంథాలయం ఏర్పాటు కోసం ముందుకు వచ్చారని తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల్లో భాషపై మక్కువ పెంచడాని, తెలంగాణ రాష్ట్రంలో ఎన్నుకోబడిన పాఠశాలలకు వారు సహకారం అందిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా పాఠశాలకు సుమారు 30 వేల నుండి 40 వేల రూపాయల విలువైన పుస్తకాలను అందించడానికి ముందుకు వచ్చారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, బాల చెలిమి గ్రంథాలయ నిర్వాహకులు మణికొండ వేద కుమార్, బాల సాహిత్య కన్వీనర్ గరిపల్లి అశోక్, తదితరులను కలిసినట్లు తెలిపారు.



పోటీ పరీక్షలు ప్రతిభను వెలికి తీస్తాయి

నవతెలంగాణ-ఆర్మూర్/సిరికొండ

పోటీ పరీక్షలు విద్యార్థుల్లో ప్రతిభా సామర్థ్యాలను వెలికి తీస్తాయని సీనియర్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టుమాస్టర్ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో కేంద్ర తపాలా శాఖ తరపున దీన్ దయాల్ స్పార్ష్ యోజన రాష్ట్రస్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షను నిర్వహించారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి పోటీ పరీక్షలపై పట్టు సాధించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తపాలా ఇన్స్పెక్టర్ శ్రావణ్, పోస్ట్మాస్టర్ కిషన్ నాయక్, డిప్యూటీ పోస్ట్మాస్టర్ విజయ్ కుమార్, సురేందర్ (ట్రెజరర్), పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సిరికొండలో..

సిరికొండ :విద్యార్థులలో విషయ పరిజ్ఞానం పరీక్షించుకొనుటకు అంతర్లీనంగా ఉన్నా ప్రతిభా సామర్థ్యాలను పోటీ పరీక్షలు వెలికితీస్తాయని నిజామాబాద్ సబ్ డివిజన్ తపాలా శాఖ సహాయ పర్యవేక్షకులు సుష్మితాబెనర్జీ పేర్కొన్నారు. కేంద్ర తపాలా శాఖ తరపున 'దీన్ దయాల్ స్పార్ష్ యోజన' రాష్ట్ర స్థాయి జనరల్ నాలెడ్జ్ పోటీ పరీక్షను సత్యశోధక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సుష్మితాబెనర్జీ మాట్లాడుతూ.. తపాలా శాఖలో అకౌంట్ ఉన్న ఆరు నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం పోటీ పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. తపాలా శాఖ పైన అవగాహనా, స్టాంపుల సేకరణ అలవాటును పెంపొందించి విజేతలైన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించి ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.నర్సయ్య, నిజామాబాద్, ఇందల్వాయి, ధర్పల్లి, సబ్ పోస్ట్ మాస్టర్స్ నవీన్, సృజన్, నితిన్‌రెడ్డి, తపాలా శాఖ ప్రతినిధులు గోపాల్, లింగం, రవి, నరేందర్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విప్లవోద్యమ నిర్మాణంతోనే కుల నిర్మూలన సాధ్యం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ మాక్లూర్

మహాత్మ జ్యోతిబాపూలే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా విప్లవోద్యమం నిర్మించడం ద్వారా కుల నిర్మూలన సాధించగలుగుతామని న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నగర కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే 152వ జయంతి సందర్భంగా కుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నీలం రామచంద్రయ్య భవన్లో కుల నిర్మూలనపై సదస్సు నిర్వహించారు. ఆయన ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా నీలం సాయిబాబ హాజరై మాట్లాడారు. కుల నిర్మూలన కోసం జ్యోతి బాపూలే ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే సైతం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పరుచూరి శ్రీధర్ అన్న, ఐ ఎఫ్ టి యు నాయకులు ఎల్ బి రవికుమార్ , శివకుమార్, రమేష్, శంకర్, మహిళా సంఘం నాయకురాలు పి సరిత తదితరులు పాల్గొన్నారు

మహాత్మ జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ కాలనీలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా మనదేశంలోని కుల వ్యవస్థ ఏర్పడిందన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే 1873 సెప్టెంబర్ 24వ సత్యశోధక్ సమాజ్ స్థాపించి కుల వ్యవస్థ నిర్మూలన కోసం కృషి చేశారు. కులంగిరి లాంటి పుస్తకాలు రాసి వర్ణ వ్యవస్థను దునిమాడారని అన్నారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూయు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్, అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ నాయకులు అబ్బయ్య, సంజీవ్, నవీన్, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్:మండలంలోని బోర్గాం(కె) గ్రామంలో మహాత్మా జ్యోతిబాపూలే సత్యశోధక్ సమాజ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ భారతదేశంలో కుల వ్యవస్థ నిచ్చెన మెట్ల లాగా ఉందని, కులవ్యవస్థను పూర్తిగా నిర్మూలించినప్పుడే దేశం పురోగతి చెందుతుందని అన్నారు. పాలకవర్గ పార్టీలు కులాల మధ్య చిచ్చులు పెట్టి వాటిని పెంచి పోషిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం మండల అధ్యక్షులు తడకల కృష్ణ గౌడ్, ప్రగతిశీల మహిళా సంఘం నిజామాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి దేశెట్టి రాధా, ఏఐకేఎంఎస్ గ్రామ ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు, పిడిఎస్‌యు నాయకురాలు దేశెట్టి స్నేహిత , రైతు కూలీ సంఘం నాయకులు రాపాని గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అభినందన

నవతెలంగాణ-కమ్మర్ పల్లి

మండల కేంద్రంలోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియంలో ఈనెల 26, 27, 28 తేదీలలో జరిగిన మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల్లో మండల కేంద్రానికి చెందిన శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు 8 బహుమతులు గెలుపొందారు. ఇందులో జూనియర్ బాయ్స్ వాలీబాల్ ప్రథమ బహుమతి, జూనియర్ గర్ల్స్ వాలీబాల్ ప్రథమ బహుమతి, జూనియర్ బాయ్స్ ఖోఖో ప్రథమ బహుమతి, జూనియర్ గర్ల్స్ కబడ్డీ ద్వితీయ బహుమతి, సబ్ జూనియర్ బాయ్స్ వాలీబాల్ ద్వితీయ బహుమతి, జూనియర్ గర్ల్స్ ఖోఖో తృతీయ బహుమతి, జూనియర్ బాయ్స్ కబడ్డీ తృతీయ బహుమతితో పాటు మార్చ్ ఫాస్ట్ లో ప్రథమ బహుమతి గెలుపొందారు. ఈ మేరకు ఆదివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, కోఆర్డినేటర్ జాన్ సుందర్, పిఈటి అజయ్, ఉపాధ్యాయులు సింఫనియా, నకుల్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ మేళాకు విజయ్ విద్యార్థిని

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

28వ జాతీయ యువజనోత్సవాలలో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ నేపథ్యంలో నూతన ఆవిష్కరణలతో సైన్స్ మేళాను మాణిక్ భావన్ పాఠశాలలో ఈనెల 28న నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌మేళాలలో విజయ్ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థి సిహెచ్.హన్సిక 'అడాలిసెన్స్ అవేర్నెస్' ప్రోగ్రాం' అనే అంశంపై పోస్టరు తయారుచేసి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డా. అమృతలత విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు.

రక్త నమూనా సేకరణ పరీక్షలు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం 'రక్త నమూనా సేకరణ పరీక్షలు' నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఐ వి.రజినీకాంత్ హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రజినీకాంత్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు అమలు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రక్త నమూనా పరీక్షలు నిర్వహించి వారి వారి పేర్లను నమోదు చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు కె.గంగాధర్, గోపి రాము, జక్కుల ప్రవీణ్ కుమార్, గోపీనాథ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రానికి చెందిన విశ్వబ్రాహ్మణ యువజన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం సంఘ సభ్యులు సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా రాజారపు నర్సయ్య, కోశాధికారిగా పరికిపండ్ల నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాజారపు నర్సయ్య మాట్లాడుతూ...తనపై నమ్మకంతో 7 సంవత్సరాల నుండి ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భోజనం వితరణ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జిజి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిత్రమాసాన్ని పురస్కరించుకొని సుమారు 200 భోజనం ప్యాకెట్లు,వాటర్ బాటిల్స్,అరటిపం డ్లు పట్టణం తోపాటు, మున్సిపల్ పరిధిలోని ,పెర్కిట్, మామిడిపల్లిలో యాచాకులకు, నిరుపేదలకు పంపిణీ చేసినట్టు వ్యవస్థాపాక అధ్యక్షులు లయన్ నివేధన్ గుజరాతి ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ మాజీ అధ్యక్షులు డీజే దయానంద్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు దొండి నారాయణ వర్మ, డిజే. ప్రేమనాథ్,బేల్దారీ శ్రీనివాస్,డిజే. కాశినాథ్,గుజరాతి గీత,వినంతి గుజరాతి,డిజే హేమలత, మీరాబాయి, నిర్మల గటడి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రెండులక్షల రుణమాఫీ చేయాలి

- **రెంజర్ల పీఏసీఎస్ మహాజన సభలో తీర్మానం**

నవతెలంగాణ-ముప్కాల్



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్

రెంజర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ మహాజన సభలో సొసైటీ చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్ అధ్యక్షతన వివిధ రకాల అంశాలపై చర్చించి అమోదించి తీర్మానించా మన్నారు. రైతులకు ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని,ప్రభుత్వం చెప్పిన విధంగా వడ్లకి రూ.500 బోనస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మన్ ముస్కు సంతోష్ రెడ్డి, సెక్రటరీ గంగాధర్, డైరెక్టలు మేడిపల్లి ముత్తేన్న, సామ రాజేందర్, బుయ్య రాజన్న, క్యాతం గంగారెడ్డి మరియు సొసైటీ సిబ్బంది, క్లస్టర్ రైతులు పాల్గొన్నారు..

బోరుపనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ- కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ షబ్బీర్ అలీ సూచన మేరకు పట్టణంలోని 15వ వార్డులో నూతన బోరును మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని 15వ వార్డులో అశోక్‌నగర్, భారతిపురం కాలనీలో నీటి సమస్య ఉందని కౌన్సిలర్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి బోరు వేయించారని వార్డ్ కౌన్సిలర్ వనిత రామ్మోహన్ తెలిపారు. కార్యక్రమంలోని కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతి



నవతెలంగాణ-ఎడపల్లి

కరెంట్ షాక్‌తో కౌలు రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తానాకాలన్ గ్రామ రెవెన్యూ శివారులో చోటుచేసుకుంది. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోచయ్య (55) అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి సంబంధించిన వ్యవసాయ పంట పొలాన్ని పోచయ్య కౌలు చేస్తున్నాడు. ఈ క్రమంలో పోచయ్య పంట పొలాలను చూసేందుకు వెళ్లిన తర్వాత పంట పొలాలలో విద్యుత్ వైర్లు తగలడంతో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు.

ఓటరు జాబితాలో తప్పులు

ఊరు ఒకటైతే.. ఓటు హక్కు మరోచోట

- ఏ వార్డులో ఎవరికి ఓటు ఉందో తెలియక సతమతం
- ఓటరు లిస్టు తమకు ఇవ్వాలంటున్న పోటీచేసే ఆశావాహులు
- అధికారులు ఇంటింటి ఓటరు సర్వే చేస్తేనే సమస్యకు పరిష్కారం

నవతెలంగాణ-భిక్కనూర్

త్వరలో రాష్ట్రంలో జరగనున్న రెండవ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎలక్షన్ కమిషన్ నుండి వచ్చిన ఆదేశాల మేరకు అధికారులు రెండుసార్లు గ్రామపంచాయతీలలో ఓటర్ లిస్ట్‌లను ప్రచురణ చేశారు. తప్పులు, మార్పులు చేర్పులు, అభ్యంతరాలుంటే తెలియజేయాలని రాజకీయ పార్టీ నాయకులతో మండల కార్యాలయాలలో సమావేశం సైతం ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఓటరు లిస్టును చూసుకొని అభ్యంతరాలు తెలియజేయాలని చెప్పారే తప్ప ఓటర్ లిస్టు చేతికి ఇవ్వలేదు. తద్వారా గ్రామాలలో పోటీ చేసే అభ్యర్థులు చాలామంది ఉన్న కారణంగా ఎవరు కూడా పంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను చూడడానికి చాలా సమయం పడుతుందని చేతికి వచ్చేవరకు నిరీక్షిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా. పలు గ్రామాల్లో ఓటరు లిస్టులో తప్పులు సైతం దొర్లాయి. భిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన ఓ ఓటరు పేరు.. కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ ఓటరు లిస్టులో ఉంది. ఇలాంటివి సరిదిద్దాలంటే అధికారులు ఇంటింటికీ ఓటరు సర్వే నిర్వహించి జాబితాను సరిచేయాల్సిన అవసరముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



వాస్తవానికి అధికారులు ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీలలో ప్రచురణ చేయకుండా పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే ఓటర్ జాబితాను అందజేసి తప్పులను, అభ్యంతరాలను తెలియజేయాలని చెప్పడం లేదా అధికారులే స్వయంగా గ్రామాలలోని బిఎల్వోలు, పంచాయతీ సిబ్బందిచే ప్రతి ఇంటికి ఓటరు జాబితా సర్వే చేయించడం, ఓటర్ కార్డు లేనివారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించడం లేదా దరఖాస్తు పత్రాలను స్వీకరించడం వంటి చర్యలు చేపడితే బాగుంటుందని ప్రజాప్రతినిధులు, పోటీ చేసే అభ్యర్థులు కోరుకుంటున్నారు.

మా ఊరిలో నాకు ఓటు లేదు



భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెంది న నాకు ఓటు హక్కు మా గ్రామంలో లేకుండా కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ ంలో ఉంది. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థి ఓటర్ లిస్టు పరిశీలించి నా ఓటు కామారెడ్డి రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఉందని తెలియజేస్తే తప్ప నాకు తెలియలేదు. అధికారులు ఏ గ్రామానికి చెందిన ఓటు అదే గ్రామంలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

- రమేష్ రెడ్డి, రామేశ్వర్‌పల్లి.

పక్క ఊరికి వెళ్లి ఓటెయ్యాలా..?



రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన నా ఓటు నా గ్రామంలో లేకుండా పక్క గ్రామమైన తిప్పాపూర్ గ్రామంలో ఉంది. నా గ్రామంలో సర్పంచ్ ఎన్నుకునే హక్కు నాకుంది. కానీ పక్క గ్రామంలో ఓటు ఉన్న కారణంగా సర్పంచ్ ఎన్నికలలో పక్క ఊరికి వెళ్లి ఓటు వేయాలా?. అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరి ఓటు ఎక్కడ ఉందో ఓటరుకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- అభిరామ్ రెడ్డి, రామేశ్వర్‌పల్లి.

అలంకారప్రాయంగా గ్రామపంచాయతీలలో ఓటరు జాబితా ఉన్న కారణంగా ఎవరు కూడా గ్రామపంచాయతీ కార్యాలయాలలో గంటల తరబడి నిలబడి ఓటరు జాబితా పరిశీలించే సమయాన్ని కేటాయించలేకపోతున్నారు.

పలువురు సతమతం..

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటర్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి?, ఎక్కడ చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఓటర్ కార్డు ఉన్నవారు వారికి ఏ వార్డులో ఉంది?, ఏ బూతులో ఓటెయ్యాలి? అసలు ఓటర్ కార్డు తమ గ్రామంలోనే ఉందా? లేదా తెలియక సతమతమవుతున్నారు.

ఇంటింటి సర్వే అవసరం..

అధికారులు రెండవ సాధారణ ఎన్నికలకు చాలా సమయం ఉన్న కారణంగా గ్రామాలలో అలంకారప్రాయంగా గ్రామపంచాయతీలలో ఉన్న ఓటరు జాబితాను అధికారులతో ప్రతి ఇంటికి ఓటరు సర్వే నిర్వహించి ఎవరి ఓటు ఎక్కడ ఉంది?, ఏ వార్డుకు చెందిన వ్యక్తికి సంబంధించిన ఓటు? అదే వార్డులో ఉందా? లేదా? అనే విషయాలను పర్యవేక్షించి పూర్తి నివేదిక ఆధారంగా ఓటరు జాబితాను ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే సరి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

రాజకీయ నాయకులకు ఓటరు జాబితాను అధికంగా అందజేసి నిర్ణీత సమయంలోపల అభ్యంతరాలు తెలియజేయాలని తుది ఓటర్ జాబితాను అందజేస్తే తప్ప ఓటర్ లిస్ట్ పై తప్పులు తెలియవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓటర్ లిస్టు ఆధారంగా ఇటు అధికారులు, అటు రాజకీయ నాయకుల సహకారంతో పూర్తి నివేదికను తయారు చేయాలని ఓటర్లు కోరుచున్నారు. ఓటరు జాబితా అధికారికంగా పోటీ చేసే అభ్యర్థులకు అందజేయడంపై అధికారులను వివరణ కూడా జిల్లా అధికారులను సంప్రదించి ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని తెలియజేస్తే పోటీ చేసే అభ్యర్థులకు అందజేస్తామని తెలియజేశారు.

పోల్కంపేట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం

- 35 యూనిట్ల రక్తదానం చేసిన యువకులు



రక్తదానం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గమాత ఉత్సవ కమిటీ సౌజన్యంతో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని పార్టీలకు అతీతంగా 35 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ మాట్లాడుతూ.. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు రామానుజచారి, దివిటి రమేష్, సంజీవ రెడ్డి, సత్యం, రమేష్, నాగరాజు, మోహన్, నరేష్‌గౌడ్, రాజమౌళి, గ్రామస్తులు మణిగిరి నాగరాజు, నరేష్, మోహన్, నరేష్, అనిల్, గోవర్ధన్, సిద్ధిరాములు, సునీల్‌గౌడ్, నవీన్, వివేక్, బాన్సువాడ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ సాకేత్ వర్మ, పీఆర్వో ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్లు శ్రీనివాస్, ఎబి నైజర్, సూర్యాకాంత్, సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- పాఠశాల లైబ్రరీకి పుస్తకాలు పొందుపరిచే ర్యాకులు వితరణ



ర్యాకులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 2005-2006 విద్యా సంవత్సర బ్యాచ్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని 18 సంవత్సరాల క్రితం నాటి వారి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులను సగౌరవంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వారి బ్యాచ్ జ్ఞాపకార్థం 20 వేల రూపాయల విలువచేసే పుస్తకాలు పొందుపరిచే ర్యాకులను కానుకగా గ్రంథాలయ ఉపాధ్యాయులు భాస్కర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి

మండల శివారులోని జాతీయ రహదారి 161పై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండలం కత్తల్‌వాడి గ్రామానికి చెందిన దొండిబా హైదరాబాద్ నుండి తన స్వంత గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా జాతీయ రహదారిపై గొర్రెల మంద అడ్డురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగింది. స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో చికిత్స కోసం ఆయనకు పిట్లం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలు గ్రామాల్లో భారతీయ కిసాన్ సంఘం కమిటీల ఎన్నిక

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం భారతీయ కిసాన్ సంఘం నూతన కమిటీలను ఎన్నుకున్నట్టు విద్యుత్ వినియోగదారుల ఫోరం సభ్యులు రాజా గౌడ్ తెలిపారు. మండలంలోని అయ్యపల్లి, శెట్టిపల్లి గ్రామాలలో గ్రామస్తుల సమక్షంలో రైతు కిసాన్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. శెట్టిపల్లి గ్రామ అధ్యక్షులుగా అంజాగౌడ్, ఉపాధ్యక్షులు భూపాల్‌రాజు, కార్యదర్శి అట్టెం శీను, సహాయ కార్యదర్శి దుర్గయ్య, కార్యవర్గ సభ్యులు సలహాదారులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కిష్టగౌడ్ గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె గంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి జన్మదినం సందర్భంగా ఆయనకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు కలిసి శాలువాతో సత్కరించి బోకేను అందించారు. కార్యక్రమంలో నాయకులు కందగట్ల రాంచంధర్, మల్లెపూల శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ పనులు వేగవంతం

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో గత ఎన్నో సంవత్సరాలుగా కరెంటు తీగలు తక్కువ ఎత్తులో ఉన్నందున వాహనాలు ప్రయాణించే సమయంలో ప్రజలకు ఇబ్బందిగా మారేది. గత కొన్ని రోజులుగా ఎలక్ట్రిసిటీ సిబ్బంది, ఏఇ నర్సారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలను, వైర్లను మారుస్తూ సరిచేస్తున్నారు. దీంతో మండల కేంద్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోదాములను ఆధునీకరిస్తాం

- ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి గోదాములను ఆధునీకరణ చేస్తామని ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులకు లింగంపేట్ కాంగ్రెస్ పార్టీ బుర్ర నారాగౌడ్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల కోసమే మార్కెట్ కమిటీ పని చేస్తుందని రైతుల సమస్యలను పరిష్కరించి రైతుల పక్షాన నిలుస్తుందని తెలిపారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్, లింగంపేట్ మండలాల పరిధిలో రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా పాలకవర్గం పనిచేస్తుందన్నారు. గ్రామాల్లోని పాలకవర్గ సభ్యులు రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆమె సూచించారు. రైతుల పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచేందుకు గతంలో నిర్మాణం చేపట్టినటువంటి గోదాములు ఆధునీకరణకు శ్రీకారం చుడతామన్నారు. అంతే కాకుండా లింగంపేట్ మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో గల ప్రభుత్వ స్థలంలో గతంలో గోదాం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. లింగంపేట్‌లో రైతులు పండించిన పంట నిల్వ చేసేందుకు గోదాం తప్పనిసరిగా అవసరమన్నారు. స్థలాన్ని పరిశీలించి సర్వే నిర్వహించి అక్కడే నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. గ్రామాల్లో పశువుల సంపద అధికంగా ఉండడంతో పశువులు రోగాల బారిన పడకుండా ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాలకవర్గ సభ్యులు ఎప్పటికీ రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతులకు ఏ సమస్యలు వచ్చినా వాటిని సకాలంలోనే పరిష్కరిస్తామని ఆమె హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో రైతులకు పెద్దపీట వేసిందన్నారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ జిల్లాలోని ఆదర్శంగా నిలిచేందుకు పాలకవర్గ సభ్యులు రైతుల సహకారం అవసరమన్నారు. ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు సహకారంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి దిశగా నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ జొన్నల రాజు, డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, పులియ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు ఫతియోద్దీన్, రఫీకొద్దీన్, వంజరి ఎల్లమయ్య, దురిశెట్టి అశోక్, డాక్టర్ విట్టల్, దశరథ నాయక్, ఏదుల్ ప్రసాద్ గౌడ్, ప్రదీప్, జక్సాని రవి, హరి, సత్యం, గోవింద నాయక్, అల్లూరిగౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు సన్మానం

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చెక్కు అందజేత

నవతెలంగాణ-పిట్లం

రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన లారీ అసోసియేషన్ సభ్యుడు అబ్దుల్ జబ్బర్‌కు మండల లారీ అసోసియేషన్ వెల్ఫేర్ తరపున కుటుంబ సభ్యులకు ఒక లక్ష రూపాయల ఆర్థిక సహాయం చెక్కును ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ లారీ స్టేట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఎస్.కె.షేక్ చాంద్‌పాషా అందజేశారు. ఆదివారం మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్ హల్‌లో లారీ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యులతో చర్చించి బాధిత కుటుంబానికి మరింత ఆర్థిక సహాయం అందేవిధంగా కృషి చేస్తామని అన్నారు. మృతుడి కుమారుడికి రూ.5వేలు నగదు రూపంలో అందజేశారు. కాగా మృతుని లారీ ఫైనాన్స్ బాకీ ఉన్న డబ్బుల గురించి అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించి ఎన్ఓసి ధ్రువపత్రాలు అందజేశారు. ఆత్మీయ సమ్మేళనానికి జిల్లా ప్యాడి ఎగుమతుల గుత్తేదార్ చిన్న, పిట్లం, నిజాంసాగర్ మండలాల రైస్ మిల్ అసోసియేషన్ సభ్యులు హాజరు కావడంతో పిట్లం, నిజాంసాగర్ మండలాల లారీ యజమానులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ లారీ స్టేట్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి కొయ్యాడ సుధాకర్ రెడ్డి, కోశాధికారి వేముల గోపాల్, మండల అధ్యక్షులు ఎంఏ కుద్దూస్, ఉపాధ్యక్షులు కె.దత్తు, సెక్రటరీ షేక్ కరీం తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసహాయం చెక్కును అందజేస్తున్న అసోసియేషన్ వేల్ఫేర్ సభ్యులు

రోడ్డు పనుల పట్ల హర్షం



కొనసాగుతున్న రోడ్డు పనులు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రం మీదుగా 161వ జాతీయ రహదారి ఉన్న విషయం తెలిసిందే. ఈ జాతీయ రహదారి మండల కేంద్రానికి బైపాస్‌గా వెళ్ళింది. మండల కేంద్రానికి వచ్చే ఇరువైపులా రోడ్డు ఏండ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేక గుంతల మయంగా మారాయి. వాహనదారుల ఇబ్బందులు గమనించిన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు మండల కేంద్రానికి ఇరువైపులా జాతీయ రహదారి నుంచి డబుల్ బీటి రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా చేపడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే పనితీరుపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమరసతా సాహిత్యంతో ఐకమత్యం సాధిద్దాం

నవతెలంగాణ-కామారెడ్డి

కవులు, రచయితలు సమరసతా సాహిత్యం సృష్టించి సమాజ ఐకమత్యాన్ని సాధించాలని సామాజిక సమరసతా వేదిక కళా విభాగం రాష్ట్ర కన్వీనర్ బండిరాజుల శంకర్ పిలుపునిచ్చారు. సామాజిక సమరసతా వేదిక కామారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో వశిష్ఠ డిగ్రీ కళాశాలలో సమరసతా మూర్తులు దున్న ఇద్దాసు, గుర్రం జాషువా, బోయి భీమన్న, చిలకమర్తి లక్ష్మీ నరసింహం జయంతి వేడుకలు, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహ సంయోజకులు సంగన్న గారి బాలరాజు గౌడ్, గౌరవ అధ్యక్షులు తుమ్మ రామచంద్రం, సామాజిక సమరసతా వేదిక జిల్లా అధ్యక్షులు అమృత రాజేందర్, జిల్లా సంయోజకులు భూంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భుంపల్లి భూపాల్, జిల్లా కార్యదర్శి జంగం ప్రశాంత్, నగర సంయోజకులు దత్తు రావు, సంగి రాజేందర్, బాలకృష్ణ, తాటిపాముల రాజేంద్రప్రసాద్, కృష్ణమూర్తి, చౌకి రాజేందర్, ఆస రాజేశ్వర్, పరమేష్, కవులు పాల్గొన్నారు.

రుణమాఫీ, పెట్టుబడి సాయం కోసం నేడు మహాధర్నా

నవతెలంగాణ-గాంధారి

రైతులకు ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, అలాగే పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధారి మండల కేంద్రంలో భారీ ధర్నా ఉంటుందని అఖిల పక్షం నాయకులు ఆదివారం తెలిపారు. నెహ్రూ విగ్రహం దగ్గర ఉదయం10 గంటలకు అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గాంధారి మండల రైతు సోదరులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు డెస్క్ బెంచీల వితరణ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని బెజ్జోర హైస్కూలుకు ప్రముఖ పారిశ్రామిక వేత్త దయానంద రెడ్డి సుమారు లక్ష రూపాయల విలువ గల 20 డెస్క్ బెంచీలను ఆదివారం అందించారు. దాతకు, బెంచీలు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయురాలు నీలా రాణికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హఫీజుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ సమీపంలో ఒక వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గణేశ్ (23) అనే వ్యక్తి తన అక్క బావతో కలిసి నివసిస్తున్నాడు. ఆయనకు వివాహం కాగా గొడవల కారణంగా భార్యతో దూరంగా ఉంటున్నాడు. ఈ విషయమై కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గణేశ్‌తో మాట్లాడేందుకు శనివారం ఆయన బావమరిది నగరానికి వచ్చాడు. స్టేషన్ వద్ద గణేశ్‌తోపాటు అతని బావమరిది, అక్క, బావ మాట్లాడుకున్నట్లు తెలిసింది. అనంతరం బావమరిది మళ్లీ వస్తానని చెప్పి వెళ్లాడు. అయితే సాయంత్రం సమయంలో స్టేషన్ వద్ద పట్టాలపై గణేశ్ మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వెంటనే మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మహేష్, తోపాటు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే మృతుడి మెడకు తాడు వేసి ఊపిరాడకుండా చేసి హతమార్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.